కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో రెండు హాళ్లలో 28 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం మరో 7 టేబుళ్లు
- కౌంటింగ్ సిబ్బంది 140 మందికి శిక్షణ
- 23 రౌండ్లలో ఫలితాలు వెల్లడి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన శేరిలింగంపల్లి అబ్జర్వర్ ఐఏఎస్ అధికారి శిల్పాగుప్తా



గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ ఏర్పాట్లు

గచ్చిబౌలి: ఓట్లు కౌంటింగ్‌నకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం కౌంటింగ్ గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో జరగనున్న విషయం తెలిసిందే. ప్రధాన ద్వారం పక్కన వాహనాలు పార్క్ చేసి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. స్టేడియానికి ఉన్న రెండు ద్వారాల నుంచి లోపలికి ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియం లోపలికి వెళ్లేందుకు సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరు ద్వారాలు ఏర్పాటు చేశారు. మీడియా కోసం ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేయనున్నారు. పాస్‌లు ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశం ఉంటుందని శేరిలింగంపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.



స్టేడియంలో అధికారులకు సూచనలు ఇస్తున్న ఐఏఎస్ అధికారి శిల్పాగుప్తా

కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన శిల్పాగుప్తా

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియాన్ని శనివారం ఐఏఎస్ అధికారిణి, శేరిలింగంపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకురాలు శిల్పా గుప్తా సందర్శించారు. కౌంటింగ్ కేంద్రం ద్వారాలు, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ హాల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి పలు సూచనలు చేశారు.

23 రౌండ్లలో ఫలితం

శేరిలింగంపల్లి నియోజకవర్గం మొత్తం ఓట్లు 7,32,506 ఉండగా 48.75 శాతం ఓట్లు అంటే 3,57,074 పోలయ్యాయి. దేశంలోనే అత్యధికంగా నియోజకవర్గంలో మొత్తం 638 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రంలో ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రెండు హాళ్లలో 28 టేబుళ్లు, మరో హాల్‌లో పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం 7 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 23 రౌండ్లలో ఓటర్ల లెక్కింపు పూర్తి కానుంది. ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అనంతరం ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. పోలింగ్ స్టేషన్లు ఎక్కువగా ఉండటంతో లెక్కింపు ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశం ఉంది.

భవితవ్యం తేలేది నేడే..

శేరిలింగంపల్లి అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. 31 మంది అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ ప్రధాన పార్టీలకు చెందిన బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ, కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్‌లు పోటీ పడుతున్నారు. ఎవరికి వారు లెక్కలు వేసుకుంటూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది గంటల్లో విజయం ఎవరిని వరించనుందో తేలనుంది.



అనుమతి లేకుండా స్టేడియం లోపలికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడు

పుష్పాంజలి..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన విన్సన్ట్ పాల్ బృందం గణేశస్తుతి, దేవార్ణమా, పంచరత్నకృతి, తిల్లాన అంశాలను ప్రదర్శించారు. అలాగే నృత్యతరంగ అకాడమీ గురువు పూర్ణిమ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, వర్ణం, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు.

వీణాగానం..
అన్నమయ్య కీర్తనలు



మాదాపూర్: అన్నమయ్య సంకీర్తనలను వీణాగానంతో ఆలపించారు కళాకారులు.మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా వరవీణ మ్యూజిక్ అకాడమీ గురువు శాంతి చంద్రిక శిష్యబృందం, పద్మశ్రీ శోభరాజు శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. వాయిద్య సహకారం వీణ గాయత్రి, తబలా శశిభూషణ్ అందించారు.

4న రుద్రహోమం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సోమవారం రుద్రహోమం ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి శనివారం తెలిపారు. ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం వరకు 108 సార్లు రుద్రహోమం నిర్వహించనున్నట్టు వివరించారు. గణపతి హోమం, బగలాముఖి హోమాలు జరుగుతాయని ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

తారానగర్-లింగంపల్లి రాకపోకలకు బ్రేక్



తారానగర్-లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డు మూసివేసిన దృశ్యం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద సమస్య పరిష్కారానికి చేపట్టిన బాక్స్‌టైప్ కల్వర్ట్ నాలా పనులు కొనసాగుతున్నాయి. లింగంపల్లి విలేజ్ కమాన్ వద్ద కల్వర్టు పనులు చేపట్టడంతో తారానగర్ నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్‌లకు రాకపోకలను మళ్లించారు. లింగంపల్లి నుంచి తారానగర్‌కు వెళ్ళే వారు లింగంపల్లి విలేజ్ మీదుగా వెళ్ళాల్సి ఉంది. అదే విధంగా తారానగర్ నుంచి వచ్చే వారు లింగంపల్లి విలేజ్ లోపలి నుంచి అండర్ బ్రిడ్జి వరకు రావాల్సి ఉంది.

25 కిలోమీటర్లు సైకిల్ రైడ్



గోల్కొండ చేరుకున్న రైడర్లు

రాయదుర్గం: వీకెండ్ సైకిల్ రైడ్ ఉత్సాహంగా సాగింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ పర్యవేక్షణలో వ్యవస్థాపకుడు అశోక్ నాయకత్వంలో 25 కిలోమీటర్ల సైకిల్ రైడ్‌లో పాల్గొన్నారు. గచ్చిబౌలి హెచ్‌బీసీ వద్ద ప్రారంభమైన ఈ రైడ్ బయోడైవర్సిటీ పార్కు కూడలి, రాయదుర్గం, టోలిచౌకి, నానల్ నగర్ కూడలి, లంగర్‌హౌజ్ మీదుగా గోల్కొండ వరకు సాగింది, అనంతరం తిరిగి అదేమార్గంలో హెచ్‌బీసీ బైక్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఔత్సాహికులు వీకెండ్‌లో ఉదయం 5.30 గంటలకు హెచ్‌బీసీ బైక్ స్టేషన్‌కు చేరుకుంటే పాల్గొనవచ్చని, సైకిళ్ళు అందుబాటులో ఉంటాయని హెచ్‌బీసీ మేనేజర్ శ్రావణ్ తెలిపారు.

ఉత్తమ సాహితీవేత్త ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

యోగి వేమన విశ్వవిద్యాలయంలో అవార్డు అందజేత



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు పురస్కారం అందిస్తున్న అతిథులు

రాయదుర్గం: సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును తమిళ సాంస్కృతిక పరిశోధనా కేంద్రం పాలక్కడ్ ఆధ్వర్యంలో శనివారం కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉత్తమ సాహితీవేత్త పురస్కారం అందజేశారు. కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం , తమిళ కల్చరల్ రీసెర్చ్ సెంటర్ పాలక్కాడ్, డీఏవీ కళాశాల అజ్మీర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వనవిల్‌కె రవి రచనల్లో భిన్న దృక్పథాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రసిద్ధ తమిళకవి, న్యాయవాది వనవిల్‌కె రవి, రాజస్థాన్ సెంట్రల్ యూనివర్శిటీ హిందీశాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఎస్ లక్ష్మీఅయ్యర్, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, పరిశోధక విద్యార్థులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్, ఆచార్య ఎస్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఉప్పలధడియం వెంకటేశ్వర, డాక్టర్ జిల్లెల బాలాజీ, వైవియు తెలుగుశాఖ అధ్యక్షురాలు ఆచార్య జి పార్వతి, ఆచార్యులు ఏజి దాము, పి రమాదేవి, వినోదిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి

ఆల్విన్‌కాలనీ: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టెక్ మహీంద్రా ఫౌండేషన్ లక్ష్యం అని సెంటర్ మేనేజర్ ఏఎస్ శ్రీనాథ్ పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో మొబలైజేషన్ డ్రైవ్ నిర్వహించారు. టెక్ ఫౌండేషన్ సహకారంతో నియో కర్సర్ సంస్థ ఆధ్వర్యంలో ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్స్యూరంగాల్లో శిక్షణ, ఉద్యోగ కల్పనకు నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మరిన్ని వివరాలకు 7799594242 నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబర్ 10వ తేదీ ఆఖరు అని తెలిపారు.

సోమాజిగూడలో లైమ్‌లైట్ డైమండ్ స్టోర్



నగను ప్రదర్శిస్తున్న నటి వర్ష

బంజారాహిల్స్: వజ్రాభరణాలను ఇష్టపడే వారికోసం సోమాజిగూడలో ప్రత్యేకంగా లైమ్‌లైట్ డైమండ్స్ పేరుతో షోరూం తెరిచారు. శనివారం ఈ షోరూంను సినీ నటి వర్షతో పాటు ఎండీ పూజా శేత్ మాధవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటికే ఎనిమిది స్టోర్లను తాము ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు ఆభరణాల ప్రేమికులు అధికంగా ఉన్న ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, కోల్‌కతాలలో కూడా నాణ్యమైన వజ్రాభరణాలు, సంప్రదాయ ఫైన్ జ్యువెలరీ అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ నాగభూషణం పాల్గొని ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు.

500 మంది సిబ్బందితో బందోబస్తు



సమావేశంలో పాల్గొన్న జిల్లా పోలీసులు

- గీతం యూనివర్సిటీ వద్ద మూడంచెల భద్రత
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- ఎస్పీ రూపేష్

సంగారెడ్డి/పటాన్‌చెరు: ఐదు నియోజకవర్గాల కౌంటింగ్ నేపథ్యంలో మూడంచెల విధానంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు ఎస్పీ అశోక్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం యూనివర్సిటీలో జిల్లా పోలీసులు, కేంద్ర బలగాలు 500 మంది సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ఉదయం 8 గంటల నుంచి గీతంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్, భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా ఆర్మ్‌డ్ రిజర్వ్, స్థానిక పోలీస్ బలగాలు 500 మందితో మూడంచెల విధానంలో భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తూ, కౌంటింగ్ బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే వారికి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నియోజకవర్గాల వారీగా కేటాయించిన పార్కింగ్ ఏరియాల్లో వాహనాలను పార్క్ చేసే విధంగా చూడాలన్నారు. నిషేధిత పేలుడు పదార్థాలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకుండా చూడాలన్నారు.

144 సెక్షన్ అమల్లోకి..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని, వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐలు లాలునాయక్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వేణుకుమార్, జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



మాదాపూర్: రోడ్డుపై చలికి వణుకుతున్న పేదలకు వన్ హార్ట్ ఫౌండేషన్ సిబ్బంది శుక్రవారం రాత్రి దుప్పట్లు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు మహేష్ మంద మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా సేవ చేశామన్నారు. తన స్నేహితులతో కలసి ప్రతి సంవత్సరం ఫుడ్ కాంపెయిన్ తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభ్యులు శ్రీనివాస వరప్రసాద్, సూరజ్, మోహిత్, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదినారాయణస్వామికి పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామంలోని శ్రీదేవిభూదేవి సమేత ఆదినారాయణస్వామి ఆలయంలో శనివారం పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆయన సతీమణి సుధాతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

యాచకుడి మృతి



హఫీజ్‌పేట్ : యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం.. శనివారం లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ నంబర్ ప్లాట్‌ఫారం వైపు ఉన్న ఆటో స్టాండ్ వద్ద గుర్తు తెలియని యాచకుడు (55) పడిపోయి ఉన్నాడు. దీనిని గమనించిన ప్రజలు వెంటనే చందానగర్ పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అతను మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. యాచకుడి వివరాలు తెలిస్తే చందానగర్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పోలింగ్ స్టేషన్ 38/ఎలో 74.5 శాతం పోలింగ్

- పోలింగ్ స్టేషన్ 432లో అత్యల్పంగా 28.1 శాతం
- 268 పోలింగ్ స్టేషన్లలో 48.75 శాతం కంటే తక్కువ

గచ్చిబౌలి: ఈసారి పోలింగ్ 48.75 శాతం ఓట్లు నమోదయ్యాయి. 638 పోలింగ్ స్టేషన్లు ఉండగా కొన్ని చోట్ల ఎక్కువగా మరికొన్ని చోట్ల తక్కువగా జరిగింది. చందానగర్‌లోని హుడా కాలనీలో గల ఇగ్నియమ్ వరల్డ్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్-38/ఎలో అత్యధికంగా 74.57 శాతం ఓట్లు పోలయ్యాయి. శేరిలింగంపల్లిలోని పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్- 90లో 74.23, జగద్గిరి గుట్టలోని వెంకటేశ్వర్ కాలనీ పోలింగ్ స్టేషన్-565లో 68.76 శాతం ఓట్లు పోలయ్యాయి. 218 పోలింగ్ స్టేషన్లలో 50 నుంచి 59 శాతం ఓట్లు పోలయ్యాయి. మాదాపూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీలోని పోలింగ్ స్టేషన్- 432లో అత్యల్పంగా 28.1 శాతం, ఓల్డ్ ఎంఐజీలోని పోలింగ్ స్టేషన్- 57లో 29.6, అయ్యప్పసొసైటీలోని మెరీడియన్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్- 394లో 30.7 శాతం ఓట్లు పోలయ్యాయి. 268 పోలింగ్ స్టేషన్లలో 30 శాతం నుంచి 48.75 శాతం కంటె తక్కువగా ఓట్లు పోలయ్యాయి. దీంతో పోలింగ్ సగటున 48.75 శాతానికి మాత్రమే పరిమితమయ్యింది.

కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

పటాన్‌చెరు టౌన్: కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని, ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ అన్నారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ముందుగా కౌంటింగ్‌లో పాల్గొనే ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ సమావేశమై ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. సూచనలు చేశారు. అనంతరం బ్యాలెట్ ఓట్ల కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల అబ్జర్వర్లు ,రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

మెట్రోస్టేషన్‌కు ఒక వైపు నుంచే అనుమతి

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం ఓట్ల లెక్కింపు జరగనుండగా పోలీసులు భద్రత పెంచారు. ఈ రహదారిలో అనుమతి లేని వాహనాలు, వ్యక్తులను రాకుండా ఇప్పటికే నిషేధాజ్ఞలు విధించారు. దీని ముందే యూసుఫ్‌గూడ మెట్రో రైల్వే స్టేషన్ ఉండటంతో స్టేడియం వైపు ఉన్నమెట్ల పైనుంచి కాకుండా రోడ్డుకు అవతలి వైపు ఉన్న మెట్ల మార్గాన్ని మెట్రో ఎక్కేవారు, దిగేవారు వినియోగించుకోవాలని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పి. రవీంద్రప్రసాద్ తెలిపారు.

పార్కును పట్టించుకోండి..

కరువైన ఆహ్లాదం.. ఇదీ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ పార్కు



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ పార్కు దుస్థితి

శేరిలింగంపల్లి: లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కులను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా తయారవుతున్నాయి. నగర వ్యాప్తంగా థీమ్ పార్కులను అభివృద్ధి చేస్తున్న అధికారులు ఉన్న పార్కులపై నిర్లక్ష్యం చూపుతున్నారనడానికి శేరిలింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కు ఉదాహరణగా నిలుస్తోంది. హుడాట్రేడ్ సెంటర్ కాలనీ నల్లగండ్ల కూరగాయల మార్కెట్ సమీపంలోని పార్కును జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసింది.

- పార్కుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారిందని స్థానికులు అంటున్నారు. కాలనీలో మొత్తం అపార్టుమెంటులే ఉండటంతో సాయంత్రం వేళ కాసేపు సేద తీరుదామనుకుంటే ఆ అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పార్కులో ఎటూ చూసినా చెత్త, వ్యర్థాలు కనిపిస్తున్నాయి. పార్కులో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో కాలనీవాసులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు ఇక్కడ కూర్చొని తాగుతున్నారని స్థానికులు తెలిపారు.
- పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కులో బీరు బాటిల్స్



పార్కు గేటు వద్ద భవన వ్యర్థాలు

విజయం ఎవరిని వరించునో?

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

పటాన్‌చెరు టౌన్: ఎన్నికలు ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూములకు చేరింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో 405 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్లకు సీల్ వేసి పోలీసుల బందోబస్తు మధ్య రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. శనివారం టేబుల్‌ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగింది. అధికారులు ఒకవైపు.. ఆయా రాజకీయ పార్టీల తరఫున మరోవైపు కంచెను ఏర్పాటు చేసి ఈవీఎం లెక్కింపు ప్రక్రియను అందరికీ కనిపించేవిధంగా ఏర్పాట్లు చేశారు.

18 టేబుళ్లలో లెక్కింపు

ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ఐదు నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో 405 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి లెక్కింపు కోసం 18 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. 23 రౌండ్‌లలో ఓట్లు లెక్కిస్తామని అధికారులు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. మద్యం అమ్మకాలపై నిషేధం విధించారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద బహిరంగ ప్రదేశాల్లో సైతం ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఐదుగురి కంటే ఎక్కువమంది గుమికూడొద్దని, వీధుల్లో బాణసంచా కాల్చొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం దుకాణాలు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ముగిసే వరకు మూసి ఉంటాయని ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

జహీరాబాద్: ఈ నెల 3న ఓట్ల లెక్కింపును నిర్వహించేందుకు అధికారులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జహీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 18 టేబుళ్లలో 314 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. 17 రౌండ్లలో నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,511 పోలయ్యాయి. మూడు రౌండ్లలో వీటిని లెక్కిస్తారు. ఇప్పటికే ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రానికి తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు.

శత చండీ మహాయాగం

వెంకటేశ్వరకాలనీ: లోక కల్యాణార్థం, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ విజయగణపతి ఆలయం ఆవరణలో నిర్వహిస్తున్న శతరుద్రయాగ సహిత శత చండీ మహాయాగం శనివారం వైభవంగా జరిగింది. సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి ఈ వేడుకల్లో పాల్గొని మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. ఉదయం మహాన్యాసపారాయణం, శతచండీ రుద్రపారాయణం, హోమం, మంత్ర జపాలు నిర్వహించారు. సాయంత్రం శతచండీ రుద్రహవనాలు, రాత్రి చంద్రమౌళీశ్వర స్వామివారికి అభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుభట్ల ఆంజనేయులు నేతృత్వంలో ఈ మహాయాగం నిర్వహిస్తున్నారు.

